ప్రజాశక్తి

మంగళవారం 25 ఫిబ్రవరి 2025

5

అల్లూరి సీతారామరాజు

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-పెదబయలు :స్థానిక ఆశ్రమ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు గత నెలలో కంటి పరీక్షలు నిర్వహించి సోమవారం కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేసారు. 105 మంది విద్యార్థులకు కంటి చూపు సమస్య ఉన్నట్లు గుర్తించి కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నిఖిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి నిఖిల్

గవర్నర్ ప్రసంగంలో...

పథకాల అమలుపై ప్రస్తావన ఏదీ?

-ఆదివాసీ రాష్ట్రీయ అధికారి మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనర్స



ప్రజాశక్తి-పాడేరు:రాష్ట్ర ఉభయ సభలనుద్దేశించి సోమవారం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో పేర్కొన వివిధ పథకాల అమలు గురించి నిర్దిష్టంగా ఏమీ చెప్పకపోవడం ప్రజలకు నిరాశ కలిగించిందని ఆదివాసి రాష్ట్రీయ అధికార్ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనరస విమర్శించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వ్యవసాయ మద్దతు ధరల కల్పన, గ్రామీణ పేదల ఉపాధి హామీ, పరిశ్రమల్లో భద్రతా చర్యలు వంటి అంశాల ఊసే లేదన్నారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మెగా డిఎస్సి ప్రకటన గురించి పేర్కొన్నారే తప్ప అది ఎప్పుడు ఆచరణలోకి వచ్చేదీ చెప్పనేలేదని విమర్శించారు.షెడ్యూల్ ప్రాంతాల్లో జిఒ 3 పునరుద్ధరణ పట్ల చెప్పక పోవడం దారుణ మన్నారు. ముఖ్యమంత్రి వాగ్దానం మాటల్లో తప్ప గవర్నర్ ప్రసంగంలో పేర్కొనక పోవడం ఆదివాసీ యువతను వంచించడమేనన్నారు. కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల గురించి ప్రస్తావనే లేదని తెలిపారు. పెట్టుబడుల ఒప్పందాలు ఇంత వరకు ఒక్కటీ ఆచరణలోకి రాలేదని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని ధిక్కరించి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కేటాయింపులు సరికాదన్నారు. రైతులు, కౌలుదార్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉన్న పరిస్థితుల్లో వారు కష్టాల్లో లేరని చెప్పడం వాస్తవాలను కప్పిపుచ్చడమే నని విమర్శించారు. పెరిగిన విద్యుత్ చార్జీల భారం, అదాని – సెకి తప్పుడు ఒప్పందాల గురించి గవర్నర్ మాట్లాడలేదని విమర్శించారు. టిడిపి కూటమి మేనిఫెస్టో లోని వివిధ పథకాలను ఎప్పుడు అమలు చేసేదీ, సమాజంలోని అట్టడుగు వర్గాలు, తరగతుల సంక్షేమానికి తీసుకోబోయే చర్యల గురించి నిర్దిష్టంగా పేర్కొనలేదన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఈ నెల 27న జరుగు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం ఆదేశించారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్లో శాసనమండలి ఎన్నికలకు 12 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పిఓలకు, ఏపీఓలకు, ఓపిఓలకు మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఐటీడీఏ పిఒ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహణకు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికలకు సంబంధించిన విధి విధానాలు ఒకటికి రెండుసార్లు అడిగి తెలుసుకోవాలని సూచించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 27న ఉదయం 8 గంటల నుండి సాయంకాలం నాలుగు గంటల వరకు జరుగుతాయని చెప్పారు. అన్ని మండల కేంద్రాలతో పాటు వైజరామవరం మండలం డొంకరాయి గ్రామంలోనూ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఎన్నికలలో 400 ఓట్లకు ఒక బ్యాలెట్ బాక్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ సీసీ కెమెరాలు, మైక్రో అబ్జర్వర్లులను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలకు ముందు రోజు ఈనెల 26వ తేదీన ఎన్నికల అధికారులు, ఎన్నికల సిబ్బంది స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉదయం రిపోర్ట్ చేయాలన్నారు. ఎన్నికల అధికారులకు, సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, తహశీల్దారు పి.రామకృష్ణ, డిప్యూటీ తహశీల్దారు ఎన్వివి సత్యనారాయణ. మణికంఠ, మాస్టర్ ట్రైనర్స్ డి.టల్స్టా, సత్యనారాయణ, సాయి, వైటిసి మేనేజర్ సుధీష్, ఆర్ఐ చుక్క నిర్మల కుమారి, పిఓలు, ఏపీవోలు, ఓపిఓలు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి ఇచ్చిన శిక్షణలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు

ప్రశాంత వాతావరణంలో...

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించండి

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: ఈ నెల 27న జరుగనున్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఎన్నికల సిబ్బందికి సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిఒ, ఎపిఒ, ఓపిఓ, రూట్, సెక్టోరల్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రిసైడింగ్ అధికారి పోలింగ్ సరళి మాత్రమె సరిపోదని, అనవసర వ్యక్తులను పోలింగ్ స్టేషన్ పరిధిలోకి రాకుండా నియంత్రించే భాధ్యత కూడా చేపట్టాలన్నారు. పోలీస్ బందోబస్తు, క్యూ లైన్లను పర్యవేక్షించాలని, మొబైల్స్ తీసుకు రాకుండా చూడాలని ఆదేశించారు. సమస్యలు ఎదురైతే పోలీస్ల, రూట్ అధికారుల, సెక్టోరల్ అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పక్కాగా పరిశీలించాలని, తదనుగునంగానే పోలింగ్ నిర్వహించాలని, బ్యాలెట్ బాక్సులను ఏజంట్ల సమక్షంలో సీలు వేయాలన్నారు. ఒకవేల ఏజంట్లు హాజరు కానిచో పిఒ డైరీలో నమోదు చేయాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారి మినహా మిగిలిన సిబ్బందికి, ఓటర్లకు మొబైల్ ఫోన్ అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేసారు. పోలింగ్ ముగిసిన తదుపరి బ్యాలెట్ పేపర్ ఎకౌంట్ సరి చూసుకోవాలన్నారు. పిఒ డైరీ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. రిసప్షన్ కేంద్రంలో స్టాట్యూటరి, నాన్ స్టాట్యూటరి డాక్యుమెంట్లు కూడా ఆయా కౌంటర్లలో పోలింగ్ బాక్స్, పిఒ డైరీలతో పాటు అందజేయాలని ఆదేశించారు. రూట్, సెక్టోరల్ అధికారులు వారికి కేటాయించిన రూట్లలో అందుబాటులో ఉండి పోలింగ్ సిబ్బందికి అవసరమైన మెటీరియల్ అందించాలని ఆదేశించారు. మారుమూల మండలాలలో నిర్వహించే పోలింగ్ పట్ల మరింత కట్టు దిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎటువంటి ద్రవ పదార్థాలు పోలింగ్ కేంద్రంలోకి అనుమతించరాదని సూచించారు. వెబ్ కేస్టింగ్ ను జిల్లా కేంద్రం నుండి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ కే.పద్మలత, ఎస్డిసి లోకేష్, ఎన్నికల నోడల్ అధికారులు, రూట్, సెక్టోరల్ అధికారులు, పిఒలు, ఎపిఓలు, ఓపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్కుమార్

పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు గెలుపు ఖాయం

ప్రజాశక్తి- విఆర్.పురం

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు గెలుపు ఖాయమని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మండలంలోని విఆర్ పురం సంతలోనూ, శ్రీరామగిరి గ్రామంలోనూ పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులును గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సోయం చిన్నబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చే ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను దగా చేస్తోందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేవన్నారు. మహిళలకు ఉచిత బస్సు హామీని అమలు ఎందుకు చేయలేదో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయనివారికి ఈ ఎన్నికలో ఎందుకు ఓట్లు వేయాలో, ఎందుకు గెలిపించాలో కూటమి నాయకులు సమాధానం చెప్పాలన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, స్కీమ్ వర్కర్ల సమస్యలపై జరిగిన పోరాటాల్లో పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులు ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. ఈ తరగతుల సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసనమండలిలో గళమెత్తుతున్నారన్నారు. పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కమ్మచిచ్చు సత్యనారాయణ, అచ్యుతరావు, శ్రీరామ్గిరి నాయకులు ఆత్మకూర్ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలి

ప్రజాశక్తి- జి.మాడుగుల: ఉత్తరాంధ్ర టీచర్ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్, మండల నాయకులు వంతల మల్లేశ్వరరావు మండలంలోని కొత్తూరు, నేరేడు వలస గ్రామాలలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్ మాట్లాడుతూ, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు గత 19 సంవత్సరాలుగా నిజాయితీగా నిబద్ధతో విద్యారంగం పరిరక్షణకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు చేసే అన్ని పోరాటాలకు సంఘీభావాన్ని ప్రకటించడంతో పాటు ప్రత్యక్షంగా పాల్గొన్నారన్నారు.కోరెడ్ల విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ప్రచారం చేపడుతున్న నాయకులు

తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

పోలింగ్ బూత్ తనిఖీ

ప్రజాశక్తి-చింతపల్లి: 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ ను ఎంపీడీవో యుఎస్వి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్ లో ఏర్పాటుచేసిన సౌకర్యాలను పరిశీలించమన్నారు. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కలిగించామన్నారు. పాఠశాల ప్రాంగణం అలాగే వారి స్వగృహాలలో పరిసరాలు పరిశుభ్రత వంటనీరు వ్యర్థనీటితో కిచెన్ గార్డెన్ టెర్రస్ గార్డెన్ తయారీ విధానం పై అవగాహన కల్పించా మన్నారు. మరుగుదొడ్లు లేని వారు కొత్తగా మరుగుదొడ్లను నిర్మాణం చేసుకోవాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలు మత్తు పానీయాలు సేవించకుండా ఉండాలన్నారు. అలాగే ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు వచ్చేవరకు పెళ్లిళ్లు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందని సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్, ఉపాధ్యాయులు వీరభద్రం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

హుకుంపేట తహశీల్దార్పై ఫిర్యాదు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో 24 రోజులుగా గిరిజన మహిళ చేస్తున్న భూపోరాటంలో గిరిజనేతరులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ హుకుంపేట మండల తహసిల్దార్ పై జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడకు ప్రజా సంఘాల నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. తహసిల్దార్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. తహసిల్దార్ మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలను, 1/70 చట్టాన్ని పట్టించుకోకుండా గిరిజనేతరులకు పూర్తిగా కొమ్ముకాస్తున్నారని, గిరిజన మహిళ భూపోరాట విషయంలో ఉన్నతాధి కారుల ఆదేశాలను సైతం అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హుకుంపేట మండల రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకుని భూ పోరాటం చేస్తున్న గిరిజన మహిళ గంపరాయి బాలప్రభకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదుపై స్పందించిన జాయింట్ కలెక్టర్ విచారించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకలు పి.లింగమూర్తి, కన్వీనర్ చిన్నస్వామి, భాను, ఆదివాసి సేన కన్వీనర్ రాజబాబు, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఉపమాక వెంకన్న పందిరి రాటోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వరస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం పురస్కరించుకుని సోమవారం ఉదయం 7.50 గంటలకు ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మహోత్సవ పందిరి రాటోత్సవాన్ని అర్చక బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, గోపాలచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక నాయకులు, భక్తుల సమక్షంలో స్వామివారి పెండ్లిరాట ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కళ్యాణ మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు మార్చి 9వ తేదీ నుండి అంకురార్పణతో ప్రారంభమవుతాయని, 10వ తేదీన ధ్వజారోహణం, రథోత్సవం, కళ్యాణ మహోత్సవం, 17వ తేదీతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. స్వామివారి కళ్యాణ మహోత్సవాలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్ స్పెక్టర్ కూర్మేశ్వరరావు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, దేవస్థానం పాలకమండలి మాజీ చైర్మన్లు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, చిలువూరి రామ సూర్యనారాయణ రాజు, గోవిందరావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కె నూకరాజు, వైసీపీ నేతలు వీసం రామకృష్ణ, శీరం నరసింహ మూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు మిలీషియా సభ్యుల అరెస్టు

- పేలుడు సామగ్రి స్వాధీనం
- రంపచోడవరం డిఎస్పి సాయి ప్రశాంత్

ప్రజాశక్తి-రంపచోడవరం

మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఇద్దరు మిలీషియా సభ్యులను అరెస్టు చేసినట్లు రంపచోడవరం డిఎస్పి జి.సాయి ప్రశాంత్ తెలిపారు. స్థానిక డిఎస్పి కార్యాలయం సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్పి వివరాలను వెల్లడించారు. మారేడుమిల్లి మండలం పుల్లంగి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సుమారు 90 మంది మావోయిస్టు ముఖ్య నేతలు, మిలిషియా సభ్యులతో సమావేశం జరుగుతుందని మారేడుమిల్లి సిఐకి సమాచారం వచ్చింది. దీంతో రంపచోడవరం డిఎస్పి ఆధ్వర్యంలో మారేడుమిల్లి పోలీసులు, ప్రత్యేక దళాలు సమావేశం జరిగే స్థలానికి వెళ్ళగా అక్కడ నుండి మావోయిస్టులు పరారయ్యారు. సమావేశం జరిగిన ప్రదేశంలో ఇద్దరు మావోయిస్టు సానుభూతిపరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి మందు పాతర సంబంధించిన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పి సాయి ప్రశాంత్, స్వాధీనం చేసుకున్న పేలుడు సామగ్రి

వైద్య తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ హిమబిందు

నేలజర్తలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీలేరు

జికె.వీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుమ్మిరేవుల పంచాయతీ నేలజర్త గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ డికె.హిమబిందు ఆధ్వర్యాన సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో మహిళలు, చిన్నారులు, విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి హిమబిందు మాట్లాడుతూ వాతావరణంలో కలిగిన మార్పుల వల్ల గిరిజన గ్రామాల్లో ఆదివాసీలకు జ్వరం, దగ్గు, జలుబు వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధి సోకిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు. వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు. వేసవి ప్రారంభం కావడంతో పగటిపూట ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని, ప్రజలు వడదెబ్బకు గురికాకుండగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నీళ్లు అధికంగా తాగాలని, నిల్వ ఆహారం తినరాదని సూచించారు. వ్యవసాయ పనులు చేసే గిరిజనులు ఎండ నుండి రక్షణకు గొడుగులను ఉపయోగించాలన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిశువులకు నాటు వైద్యం పసర మందులు పట్టారాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్పి లోవ కుమారి, ఏఎన్ఎంలు సీత మత్స్య కొండ పాల్గొన్నారు.

రైతులు భూ ఆధార్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

రైతులు భూ ఆధార్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కె.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకుంటే ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించడం జరుగుతుందని చెప్పారు. ఈ భూ ఆధార్ ఉన్న రైతులకే పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట రుణాలు, సున్న వడ్డీలు, పంటల బీమా, పంట నష్టాలు, వ్యవసాయ యంత్ర పరికరాలుపై రాయితీ, బిందు సేద్యం, ఎరువులు, విత్తనాలపై రాయితీ వంటి ప్రభుత్వ పథకాలు వర్తించడం జరుగుతుందని చెప్పారు. నకిలీ రైతులను కూడా భూ ఆధార్ ద్వారా గుర్తించవచ్చన్నారు. మండలంలోని రైతులందరూ తమ ఆధార్ నెంబర్కు లింక్ అయిన ఫోన్ నెంబరు, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు తీసుకుని ఈ నెల 28వ తేదీ లోగా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సంప్రదించి, పార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఒకవేళ రైతులకు ఆధార్ నెంబర్కి లింక్ అయిన ఫోన్ నెంబరు లేకపోతే వెంటనే ఆధార్ సెంటర్లోగాని, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ దగ్గర ఫోన్ నెంబరు లింక్ చేసుకునే సదుపాయం ఉందని చెప్పారు.

ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేస్తున్న దృశ్యం

ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి అభిషేక్ గౌడ్

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-హుకుంపేట : మత్స్య గుండం మహాశివరాత్రి జాతరను విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్ ఆదేశించారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సోమవారం మత్స్య గుండం జాతర మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మత్స్య లింగేశ్వర స్వామి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అవసరమైన పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి మూడు రోజులు మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. జాతరలో మూడు రోజులు వైద్య శిబిరం ఏర్పాటు చేసి నిరంతరం వైద్యాధికారులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. భక్తులకు తాగునీటిని అందుబాటులో ఉంచాలని అన్నారు. దర్శనానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన బార్కేటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఉత్సవ కమిటీ చైర్ పర్సన్, సర్పంచ్ శాంతకుమారి, టి.అప్పారావు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫోక్సో కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఫోక్సో కేసులలో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనం అవుతుందని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ ఆధ్వర్యాన ఫోక్సో చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, అన్ని పాఠశాలలో పిల్లలకు మంచి-చెడు స్పర్శలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఫోక్సో కోర్టు న్యాయమూర్తి జి.ఆనంది మాట్లాడుతూ, పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫోక్సో కేసులలో శిక్ష చాలా కఠినంగా ఉంటుందని తెలిపారు. సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ మాట్లుడుతూ మార్చి నెలంతా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఫోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెజెబి న్యాయమూర్తి వరలక్ష్మి, డిసిపి (క్రైమ్స్) లతా మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధుల నిర్వహించే సిబ్బందికి సోమవారం రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. జిల్లాలోని 13 పోలింగ్ కేంద్రాలకు పిఒ, ఎపిఒ, ఒపిఒలను కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసి కేంద్రం నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా 13 పిఒలు, 13 ఎపిఒలను, 26 మంది ఒపిఒలను కేటాయించారు. అదనంగా 20 శాతం అనగా మరొక 10 మంది సిబ్బందిని కూడా కేటాయిస్తూ ర్యాండమైజేషన్ నిర్వహించారు. విధులు కేటాయించిన వారందరికీ అధికారి పత్రాలను అందజేశారు. తర్వాత జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీశంకర్, శిక్షణ నోడల్ అధికారి సుధాసాగర్ ఆధ్వర్యాన వారికి శిక్షణ ఇచ్చారు.

గంజాయి నిర్మూలనకు కృషి

కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు:: జిల్లాలో గంజాయి నిర్మూలనకు సంబంధిత శాఖలన్నీ కలసి సమిష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జరిగిన ఎన్కార్డు సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ద్వారా డ్రోన్ల సహాయంతో 274 గ్రామాలు పరిశీలించి సుమారు 82 ఎకరాలలో గంజాయి సాగును గుర్తించడం జరిగిందని తెలిపారు. ఆయా రైతులను గుర్తించి వారికి గంజాయితో నష్టాలు, దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. వారికి ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులను ఆదేశించారు. అదేవిధంగా డిఆర్డిఎ ఆధ్వర్యంలో ఎస్ హెచ్ జిల ద్వారా అవగాహన కల్పించాలని, వారికి అవసరమైన శిక్షణలు అందజేసి ఉపాధి కల్పించాలని, చిన్న చిన్న వ్యాపారాలకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా డిఎడిక్షన్ కేంద్రాలు పకడ్బందీగా పని చేసే విధంగా తీర్చిదిద్దాలని, మత్తుకు బానిసలైన వారిని గుర్తించి వారిని ఆ వ్యసనం నుండి బయటకు తీసుకు రావటానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో గంజాయికి సంబంధించి 208 కేసులు బుక్ చేసినప్పటికీ ఇంకా మారుమూల ప్రాంతాలలో సాగు జరుగుతోందని, వాటి నియంత్రణకు పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కలాశాలలులో విద్యార్థులకు గంజాయి నియంత్రణ పై అవగాహనా కల్పించి తల్లిదండ్రులను అప్రమత్తం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖని ఆదేశింహరు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ, అదనపు ఎస్పీ ధీరజ్, సిపిఒ ఎస్ఎస్ఆర్ కే.పట్నాయక్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, విద్య, వైద్య, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, అటవీ, అబ్కారీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెనుకబడిన టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ, జెసి అభిషేక్ గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పది పరీక్షల్లో మాస్ కాపీయికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటిడిఎ ఇన్చార్జి పిఒ, జెసి ఎంజె అభిషేక్ గౌడ్ హెచ్చరించారు. పాఠశాలలకు మంచి ఫలితాలు రావాలని మాస్ కాపీయింగ్‌కి ప్రోత్సహిస్తే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామన్నారు. పది పాస్ చేయిస్తామని విద్యార్థుల దగ్గర తల్లిదండ్రుల దగ్గర డబ్బులు వసూళ్లు చేస్తే ఉపేక్షించనన్నారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో 11 మండలాల ఎటిడబ్ల్యూఒలు, ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు, గురుకుల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. పిఒగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ఇప్పటి వరకు 10 ఆశ్రమ పాఠశాలలు తనిఖీ చేసానని, సాయంత్రం 5 గంటలకు ఆశ్రమ పాఠశాలలు తనిఖీకి వస్తే ఉపాధ్యాయులు ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తారు. సూపర్ వైజరీ సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండటం లేదన్నారు. ఫ్రెంచి విప్లవం గురించి అడిగితే పది విద్యార్థులు జవాబు చెప్పలేకపోతున్నారన్నారు. కొంత మంది ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని అన్నారు.మెనూ సక్రమంగా అమలు చేయాలని, విద్యార్థులకు రాగి మాల్ట్ సరఫరా చేయడం లేదని అన్నారు. ఎంఇఒలు ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థుల ప్రమాణాలు పరిశీలించాలని డిఇఒకి సూచించారు. విద్యా ప్రమాణాలు మెరుగు పరచడానికి హెచ్ఎంలు వారానికి ఒకసారి ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో సఖీ గ్రూపు సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ఆరోగ్యం, వ్యక్తి గత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని చెప్పారు.మార్గదర్శిని అమలు చేసి విద్యార్థులకు కెరీర్ గైడెన్సుపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలు మెరుగు పడటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో టిడబ్ల్యూ డిడి ఎల్.రజని, డిఇఒ పి.బ్రహ్మాజీరావు, ఎపిసి స్వామి నాయుడు, 11 మండలాల ఎటిడబ్ల్యూఒలు, ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు, గురుకుల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌ఎంగా లలిత్ బోహ్రా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వాల్తేరు డివిజన్ రైల్వే మేనేజర్‌గా 1998 బ్యాచ్ ఐఆర్‌టిఎస్ అధికారి లలిత్ బోహ్రా సోమవారం బాధ్యతలు చేపట్టారు. భారత ప్రభుత్వ నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఇ)లో సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. ఎంఎన్ఆర్ఇలో సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్నప్పుడు పిఎం సూర్యఘర్, ముఫ్త్ బిజాలీ యోజన, పిఎం-కుసుమ్, ఆఫ్‌సోర్ విండ్, గ్రీన్ ఎనర్జీ కారిడార్లు, పిఎల్ఐ స్కీమ్ ఫర్ సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్‌ను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. నూతన ట్రాఫిక్ కమర్షియల్ అండ్ పాలసీ రూపకల్పనలో విస్తృత అనుభవం ఉంది. ఆయన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ (ఎన్ఐఎస్ఇ) డైరెక్టర్ జనరల్‌గా కూడా పనిచేశారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా పనిచేశారు. రైల్వేలో పనిచేస్తూనే చీఫ్ కమర్షియల్ మేనేజర్ గా, చీఫ్ ప్యాసింజర్ ట్రాన్స్ పోర్టేషన్ మేనేజర్‌గా, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా, డిప్యూటీ జనరల్ మేనేజర్ (జనరల్)గా పలు విభాగాల్లో విధులు నిర్వహించారు. కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఉన్న సమయంలో ఆయన అతిపెద్ద డ్రై పోర్టు, డబుల్ స్టాక్ కంటైనర్ రైళ్లను నడపడంలో కీలక పాత్ర పోషించారు. లలిత్ బోహ్రా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే నుంచి బి.టెక్ (ఎలక్ట్రికల్ ఇంజినీర్), పిలానీలోని బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఎంబిఎ (ఫైనాన్స్) చేశారు.

జోన్ కార్యకలాపాలకు జాప్యమెందుకు?

- **30 నుంచి 40వేల చదరపు అడుగుల స్థలం అవసరం : తాజా డిపిఆర్ వెల్లడి**
- **పరిశీలనలో గోశాల దేవస్థానం వద్ద 2 కల్యాణ మండపాలు, ఎల్ఐసి బిల్డింగ్, ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఖాళీ భవనాలు**

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాయగడ డివిజన్‌కు శంకుస్థాపన జరిగింది. వాల్తేరు రైల్వేను విశాఖపట్నం రైల్వేగా కొనసాగించేందుకు కేంద్రం ఏళ్లతర్వాత అంగీకరించడం కూడా అయ్యింది. విశాఖపట్నం రైల్వే నూతన డిఆర్ఎం విధుల్లో చేరుతున్నట్లు ప్రకటన కూడా వెలువడింది. అయినా విశాఖ కేంద్రంగా నూతన 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' కార్యకలాపాల విషయంలో హడావుడి కానరావడం లేదు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ ప్రకటన అప్పట్లో వచ్చిన వెంటనే అక్కడి ప్రభుత్వం క్వార్టర్స్, ఆఫీసు భవనాలను సిద్ధం చేసుకుందని రైల్వే వర్గాల్లో చర్చ మొదలైంది. కాగా, కొత్త రైల్వేజోన్‌కోసం ఏర్పాటు చేయబడ్డ ప్రత్యేకాధికారి కార్యాలయం ఈ నేపథ్యంలో ప్రాజెక్టు సవివరణ నివేదిక (డిపిఆర్)లో తాజాగా 30 నుంచి 40వేల మేరకు స్థలం కొత్త జోన్ కార్యాలయ పనుల కోసం కావాలని రైల్వే బోర్డుకు నివేదించినట్లు భోగట్టా. రైల్వే జోన్ కోసం బిడ్డింగ్ రెండు నెలల క్రితమే పూర్తయింది. 2026 సంవత్సరంలో జోన్ పనులకు శ్రీకారం చుట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ లోగా జోన్ కార్యకలాపాలకైతే ఎలాంటి ఆటంకం ఉండకూడదన్న వాదన రైల్వే అధికారులు, సిబ్బంది నుంచి వినిపిస్తోంది.

జోన్ కార్యకలాపాలకు స్థల సమస్య లేదు..

ఈ నేపథ్యంలో తాజా డిపిఆర్ ప్రకారం సింహాచలం దేవస్థానం ఇటీవలే గోశాల వద్ద మెయిన్ రోడ్డుకు దగ్గర్లోనే అటు, ఇటు కొండల నడుమ రెండు కళ్యాణ మండపాలు నిర్మాణం పూర్తిచేసింది. సుమారు 50 రూముల సామర్థ్యం ఉన్నవి కావడంతో జోన్ కార్యాలయ హెడ్‌క్వార్టర్‌గా జిఎం ఆఫీసు, చీఫ్ ఇంజినీరు, చీఫ్ ఆపరేషన్ మేనేజర్, చీఫ్ ఎలక్ట్రికల్ ఆఫీసర్ ఇలా జోనల్ స్థాయి అధికారులంతా ఆశీనులై విధుల నిర్వహణకు ఈ స్థలం బాగుంటుందన్న ఆలోచన ఉద్యోగ వర్గాల నుంచి వినిపిస్తోంది. అంతేగాక విశాఖ నగరం నడిబొడ్డున ఎల్ఐసి భవన సముదాయంలో ఒక కాంప్లెక్స్ (సుమారు 20వేల ఎస్ఎఫ్‌టి), ఆర్‌టిసి కాంప్లెక్స్ మేడపైన 12వేల ఎస్ఎఫ్‌టి ఖాళీ ప్రదేశం కూడా అందుబాటులో ఉంది. ఈ విషయాలన్నీ డిపిఆర్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. దేవస్థానం కూడా టెండర్లు పిలిచి ప్రైవేట్ వాళ్లకు ఇవ్వాలన్న నిర్ణయంతో ఉంది. ఈ ప్రక్రియ పూర్తవ్వాలంటే ఏడాది కాలం పడుతున్నందున రైల్వేకు కేటాయిస్తే టెండర్లు పిలిచేలోగా దేవస్థానానికి ఆదాయం వస్తుందన్న ప్రతిపాదన చేశారు.

తూర్పు కోస్తా ఏర్పాటైన వేళలో...

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు టెండర్లనైతే రైల్వే బోర్డు పిలిచినా ఆ తర్వాత పని స్లోడౌన్ అయిందని అధికారులే స్వయంగా పేర్కొంటున్నారు. తూర్పు కోస్తా రైల్వే భువనేశ్వర్ కేంద్రంగా ప్రారంభించేందుకు ప్రకటన కేంద్రం చేసిన సందర్భంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం త్వరిత గతిన అందుకు సంబంధించిన రైల్వే ఉద్యోగ, అధికారులకు క్వార్టర్స్, ఆఫీస్ భవనాలను సిద్ధం చేసిన విషయాన్ని తాజాగా విశాఖ రైల్వే ఉద్యోగులంతా గుర్తుచేసుకుంటున్నారు. ఆ తరహాలో ఇక్కడ జోన్ కార్యకలాపాల కోసం సిద్ధపడకుండా జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కెజిహెచ్ రోగులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌కు వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందిస్తున్నామని ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ బివి.రమణ తెలిపారు. సోమవారం ఆస్పత్రిలోని ఎస్ 5 వార్డు వద్ద రోగులకు అందిస్తున్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులు, సహాయకులతో మాట్లాడి భోజనం ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. రోగులకు సరఫరా చేస్తున్న భోజనాన్ని ఆయన రుచి చూశారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని చీఫ్ డైటీషియన్ రమణమూర్తిని ఆదేశించారు.

పిచ్చి కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

గాయపడిన దుర్గాప్రసాద్, బాబూరావు

ప్రజాశక్తి-గంగవరం : మండల కేంద్రం గంగవరం గ్రామంలో ప్రెసిడెంట్ వీధిలో పిచ్చికుక్క దాడి చేయడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన మడకం బాబురావుతో పాటు తొమ్మిదేళ్ల బాలుడు పూసం దుర్గాప్రసాద్‌పై పిచ్చి కుక్క దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి భావన ప్రాథమిక చికిత్స అందించారు. పిచ్చికుక్క వీధుల్లో తిరుగుతుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు

ఆర్థిక అక్షరాస్యత, సైబర్ భద్రతపై సెమినార్

పాండురంగరావును సత్కరిస్తున్న ప్రిన్సిపల్, విద్యార్థులు

ప్రజాశక్తి- చింతూరు : ఆర్థిక అక్షరాస్యత, సైబర్ భద్రత తదితర అంశాలపై చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థ శాస్త్రం, వాణిజ్య శాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో సోమవారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన పిఠాపురం రాజా కళాశాల వాణిజ్యశాస్త్ర ఆచార్యులు డాక్టర్ జె.పాండురంగారావు 'కృత్రిమ మేధస్సు యుగంలో ఆర్థిక అక్షరాస్యత, సైబర్ భద్రత' అనే అంశం మాట్లాడారు. ఆర్థిక లావాదేవీలు జరిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.శేఖర్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉన్నప్పుడే ఆర్థిక నేరాలను అరికట్టగలమని చెప్పారు. అర్థశాస్త్ర విభాగాధిపతి జి.వెంకటరావు, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి జి.హారతి ప్రస్తుత కాలంలో ప్రజలు ఆర్థిక అక్షరాస్యత లేమితో ఎదురుకొంటున్న సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వై.పద్మ, కె.శకుంతల, కె.శైలజ, యం.నాగమోహన్‌రావు, కె.శ్రీదేవి, కె.శ్రీలక్ష్మి, రాజబాబు, జి.సాయి కుమార్, యన్.రమేష్, బి.శ్రీనివాసరావు, యన్‌వివియస్‌యన్ మూర్తి అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృ మరణాలను అరికట్టాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లాలో మాతృ మరణాలకు ఆస్కారమీయరాదని డిఎంహెచ్ఒ డాక్టర్ .పి.జగదీశ్వర రావు హెచ్చరించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ సమావేశ మందిరంలో మాతృ మరణాలపై జిల్లాస్థాయి ఎంసిహెచ్ కమిటీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ రేవిడి పిహెచ్‌సి పరిధిలోని పద్మనాథం మండలం రెడ్డిపల్లి గ్రామంలో జనవరిలో మాతృమరణం జరిగిందని, అలాంటివి పునరావృతం కారాదని అక్కడి వైద్యాధికారి, హెచ్‌వి, ఎఎన్ఎంలను హెచ్చరించారు. కెజిహెచ్, విజిహెచ్ గైనకాలజిస్టులు మాట్లాడుతూ, హైరిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించి గర్భిణులకు తగిన వైద్య సలహాలు అందించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సిబ్బందికి ప్రెగ్నెన్సీ విషయం తెలిసిన వెంటనేవారి పేర్లు నమోదుతోపాటు వ్యాక్సినేషన్, మందులతోపాటు ప్రసవం వరకు అవసరమైన సూచనలు చేయాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారి, డిఐఒ డాక్టర్ డాక్టర్ లూసీ, విజిహెచ్ సూపరెంటిండెంట్ డాక్టర్ .ఉషాప్రసాద్, డాక్టర్ హెచ్‌ఆర్‌కె.దొర, కెజిహెచ్ గైనకాలజిస్టులు డాక్టర్ .షర్మిలా కుమారి, డాక్టర్.శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రాచీన సాహిత్యంలో రుగ్వేదానికి విశిష్ట స్థానం

పుస్తకావిష్కరణలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రపంచ మౌఖిక సాహిత్యంలో రుగ్వేదానికి విశిష్ట స్థానం ఉందని పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. సోమవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మార్క్సిస్టు అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. ఆచార్య రామకృష్ణ కన్నడ మూలానికి వివిన మూర్తి తెలుగు అనువాదం కొబడ్‌గాంధీ, ఇంగ్లీష్ ప్రతికి తెలుగు అనువాదం 'బీటలు వారిన స్వేచ్ఛ', అలాగే పద్మజ షా, వివన మూర్తి విరచిత 'వాడు-నేను' మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎంవివి శర్మ మాట్లాడుతూ రుగ్వేదాన్ని మత గ్రంథంగానే చూసిన నేటి ప్రధాన స్రవంతి ఒరవడికి భిన్నంగా, దీన్ని చరిత్ర, మానవ, నరవర్గీకరణ,సామాజిక, తత్వ, దైవ, సౌందర్యశాస్త్రాల్లాంటి బహుముఖ కోణాల్లో విశ్లేషణ చేస్తే నాటి సమకాలీన సమాజం, దాని సంక్లిష్టత, బాహుముఖ రూపాలు, పరస్పరాశ్రిత సంబంధాలను అర్థం చేసుకోవచ్చన్నారు. ఒక ప్రాచీన సంకలనాన్ని ఏవిధంగా అధ్యయనం చేయాలనే విధానానికి నమూనాగా నిలిచిన రుగ్వేద యథార్థ దర్శనం పుస్తకాన్ని చదవాలని కోరారు.

'బీటలు వారిన స్వేచ్ఛ' అనువాద రచయిత పద్మజషా మాట్లాడుతూ మనిషి మనుగడకు కూడు, గూడు, నీడలతో నిండైన జీవితాన్ని గడపాలనే సాపేక్షక్రమానికి భిన్నంగా వివేధించిన, అభిప్రాయాలు కలిగిన వ్యక్తి తనకుండాల్సి సాపేక్ష స్వేచ్ఛను కోల్పోతాడనే ఇతివృత్తమే 'బీటలు వారిన స్వేచ్ఛ' గ్రంథమన్నారు. సామాజిక, ఆర్థిక, వైజ్ఞానిక నేపథ్యాన్ని కాదనుకొని అర్ధోజగత్తు సహోదరుల కోసం నాలుగు దశాబ్దాలు నిస్వార్థంగా శ్రమించిన వ్యక్తి, నిష్కారణంగా జైలుపాలై, దశాబ్దం తర్వాత నిరపరాధిగా బయటపడిన సామాజిక మేధోజీవి రాజకీయ జ్ఞాపకాల దొంతరే కోబడ్‌గాంధీ పుస్తకమన్నారు. స్వేచ్ఛ కోసం పరితపించే ప్రతిఒక్కరూ చదవాల్సిన పుస్తకమిదన్నారు.

'వాడు నేను' పుస్తక రచయిత వివిన మూర్తి మాట్లాడుతూ 'వాడి ఊరికి, నా వాడకు అరమైలు దూరం... వాడికి నాకు వేల సంవత్సరాల దూరం' అనే వాక్యాలతో ప్రారంభమయ్యే ఈ నవల, భారతదేశంలో గడచిన ఆరు దశాబ్ధాల్లో సాగిన దళిత సమస్యలతో పాటు మనిషి, సమాజం, ఆస్తి, పెళ్ళి, రాజ్యం, చట్టం, జాతి, మతం, కులం, ఆధిక్యత, న్యూనత వంటి మౌలికమైన అంశాలను, వివిధ పరిణామాలను చర్చకు పెడుతుందన్నారు. భువనగిరి, చంద్రశేకర్, కాలేకూరి ప్రసాద్, కవన శర్మ గురించి అనేకేళ్లుగా తాను తాను చేసుకున్న ఆలోచనలే ఈ రచనకు బీజమన్నారు. ఆ ముగ్గురి అమరుల గురించి కాస్త తెలిసిన ఎవ్వరికైనా ఈ నవల సాగే క్రమం తెలుస్తుందన్నారు. దళిత సమస్యను కమ్యూనిస్టులు పట్టించు కోలేదనే చర్చ, కమ్యూనిస్టు ఆలోచనల పట్ల దళిత వర్గం ఆలోచనా తీరు సరిగా లేదనే మరో చర్చతో పాటు భవిష్యత్ ఎలా ఉండాలనే ఆలోచనల మేళవింపుపై ఆసక్తి ఉన్నవారంతా వాడు-నేనూ నవలను చదువాలన్నారు. కార్యక్రమంలో మార్క్సిస్టు అధ్యయన కేంద్రం నిర్వాహకులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా మూడు పుస్తకాల గురించి నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు ఎన్ అంజయ్య వివరించారు. రుగ్వేదం యదార్థ దర్శనం పుస్తకాన్ని వృద్ధుల కల్యాణ రామారావు, ఎంవిఎస్ శర్మ, బీటలు వారిన స్వేచ్ఛ పుస్తకాన్ని కె ఎస్ మల్లీశ్వరి, కె మురళి, వాడు నేను పుస్తకాన్ని మందలపర్తి కిషోర్, జి ఎస్ రాంమోహన్ సమీక్ష చేశారు. మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు ఆచార్య గాయత్రి, ఎ వనజ, కత్తి పద్మ, డి లలిత, ఎస్ గోవిందరాజులు, ఎంఎన్ పట్నాయక్, జివిఎం రెడ్డి, వై కొండయ్య పాల్గొన్నారు.

గీతం వర్సిటీని సందర్శించిన యుఎన్‌సిడబ్ల్యు బృందం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా విల్మింగ్టన్ ప్రతినిధి బృందం సోమవారం సందర్శించింది. బోధన, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చించింది. అమెరికన్ బృందంలో యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా విల్మింగ్టన్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అశ్వని కె. వోలేటి, అసిస్టెంట్ ప్రొవోస్ట్ ఫర్ డిస్టన్స్ ఎడ్యుకేషన్, ఈ-లెర్నింగ్‌చ ప్రొఫెసర్ ఆఫ్ ఇన్‌స్ట్రక్షనల్ టెక్నాలజీ ప్రొఫెసర్ జెరెమీ డికర్సన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా యుఎన్‌సిడబ్ల్యు. ప్రతినిధులు గీతం విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎరోల్ డిసోజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, వివిధ పాఠశాలల డీన్లతో చర్చలలో పాల్గొన్నారు. ముఖ్యంగా సహపరిశోధన కార్యక్రమాలు, అధ్యాపకుల మార్పిడి ప్రోగ్రామ్‌లు, సంయుక్త అకడమిక్ కార్యక్రమాలు వంటి పరస్పర ప్రయోజనకరమైన అంశాలపై చర్చించారు. ఈ సందర్శన ద్వారా గీతం వర్సిటీ, యుఎన్‌సిడబ్ల్యు. మధ్య అంతర్జాతీయ భాగస్వామ్యం బలోపేతం, భవిష్యత్తులో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు అనేక ప్రయోజనాలను అందించడానికి దోహదపడుతుందని అభిప్రాయ పడ్డారు.

ఎంఎస్‌ఎంఇలకు కేంద్ర ప్రోత్సాహం

ప్రజాశక్తి -గాజువాక : చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం 2012లో కొత్త పాలసీని తీసుకొచ్చిందని ఎంఎస్ఎంఇ జాయింట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం గాజువాక ఆటోనగర్‌లో ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ ఆధ్వర్యంలో రెండురోజుల వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, బయ్యర్స్ అండ్ సెల్లర్స్ మీట్ కమ్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌ను జ్యోతిప్రజ్వళనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను ఒక వేదికపైకి తీసుకొచ్చి, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు మార్కెటింగ్ మద్దతు అందించడమే దీని లక్ష్యమన్నారు.

పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ -2012 ప్రకారం, కేంద్ర మంత్రిత్వ విభాగాలు, సిపిఎస్‌ఇలు తమ వార్షిక కొనుగోళ్లలో కనీసం 25శాతం వస్తువులు, సేవలను ఎంఎస్‌ఎంఇల నుంచి పొందాలని నిర్ణయించినట్లు తెలిపారు. వీటిలో నాలుగుశాతం ఎస్‌సి,ఎస్‌టి, మూడుశాతం మహిళల అధీనంలో పరిశ్రమల నుంచి కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ఎంఎస్‌ఎంఇలకు తమ తోడ్పాటును హెచ్‌పిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (మెటీరియల్), కె.తిరుమురుగన్, బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సత్యప్రసాద్ ప్రకటించారు.కార్యక్రమంలో వాసవ అధ్యక్షులు వి రాంప్రసాద్, యూకో బ్యాంక్ జనరల్ మేనేజర్ డివి రావు, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ డిజిఎం స్మిత రేవతి పాల్గొన్నారు. ఎగ్జిబిషన్‌లో ఆరు సిపిఎస్‌ఇ, నాలుగు బ్యాంకులు, 22 ఎంఎస్‌ఎంఇలకు చెందిన మొత్తం 32 స్టాల్స్ ఏర్పాటు చేశారు.

ఎటిఎ మహిళా కమిటీకి విరాళం

విరాళం అందిస్తున్న జమాల్ ఖాన్

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ మహిళా కమిటీ ఆధ్వర్యాన ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహణకు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, జెకెసి ట్రస్టు చైర్మన్ జమాల్ ఖాన్ రూ.20వేలు విరాళం అందజేశారు. ఎటపాక విద్యాశాఖ కార్యాలయంలో జరుగు ప్రపంచ మహిళా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఎటిఎ మహిళా కమిటీ ప్రతినిధులు సోమవారం జమాల్ ఖాన్‌ను కలిసి ఆహ్వానం అందజేశారు. దీనికి తన వంతు సాయంగా జమాల్ ఖాన్ రూ. 20వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటిఏ సంఘం ప్రతినిదులు పి.తులసి, జి.లక్ష్మి, ఎస్.విజయ కుమారి, టి.రజిని, బి.శారద, పి.దేవి, పి.శ్రీను, ఎం.ప్రవీణ్ పాల్గొన్నారు.

కంటి కేన్సర్‌పై అవగాహన అవసరం

డాక్టర్ లావణ్య

ప్రజాశక్తి - ఆరిలోవ : కంటి కేన్సర్ అరుదైనదైనప్పటికీ త్వరితంగా గుర్తించకపోతే అది ప్రాణాంతకం కావచ్చని, పూర్తిగా కంటిని తీసివేయడానికి దారితీయవచ్చని ఎల్‌వి.ప్రసాద్ కంటి వైద్యశాల, జిఎంఆర్ వరలక్ష్మీ ఇనిస్టిట్యూట్ నేత్రవైద్య నిపుణురాలు డాక్టర్ లావణ్య అన్నారు. అవగాహన లోపంతో చాలా కంటికేన్సర్ కేసులు తొలిదశలో కాకుండా తీవ్రమైన తర్వాత గుర్తిస్తారన్నారు ప్రపంచ వ్యాప్తంగానూ, మనదేశంలోనూ బాల్య కంటి కేన్సర్ కేసులు వెలుగుచూస్తున్నాయన్నారు. ప్రాణాంతకమైన కంటి కేన్సర్ రెటినో బ్లాస్టోమా ఇతర దేశాల కంటే భారతదేశంలో ఎక్కువగా ఉందన్నారు. కంటి కేన్సర్ లక్షణాలు స్పష్టంగా కనిపించకపోవచ్చని, ఇది క్రమబద్ధకమైన కంటి పరీక్షల్లో బయటపడతాయన్నారు. పిల్లల కంటిలో ఒక తెల్లని ప్రతిబింబం, చెదిరిన చూపు, ఉన్నట్టుండి చూపుపోవడం, ఐరిస్‌పై నల్లని లేదా పెరుగుతున్న మచ్చ, ఒక కన్ను ఉబ్బడం, కంటి ఆకారంలో ఉన్నట్టుండి మార్పు, కనురెప్ప, కంటి చుట్టూ గడ్డ, కంటి ఎరుపుదనం, దీర్ఘకాలికంగా చికాకుగా ఉండడం వంటివి కంటి కేన్సర్ లక్షణాలు కావచ్చన్నారు. ఆయా లక్షణాలుంటే వెంటనే కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏటా మే నెలలో రెటినో బ్లాస్టోమా వారోత్సవాల్లో భాగంగా కంటికేన్సర్ వ్యాధి గుర్తింపు, చికిత్సపై అవగాహన, నిధులు సమీకరణకు ఎల్‌విప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలాన్నారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన శిక్షణ జైలర్స్

ప్రజాశక్తి - ఆరిలోవ : తమిళనాడు విల్లూరులోని అకాడమీ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరప్షనల్ అడ్మిస్ట్రేషన్ (ఆప్కా)లో శిక్షణ పొందుతున్న 39 మంది జైలర్స్, అసిస్టెంట్ జైలర్స్ బృందం సోమవారం విశాఖ కేంద్రకారాగారాన్ని సందర్శించారు. స్టడీ టూర్‌లో భాగంగా సెంట్రల్‌జైలును సందర్శించిన ట్రైనీలు, ముందుగా జైలు అంతా కలియతిరిగారు. జైలు పరిపాలనా విభాగం పనులు, ఖైదీల దినచర్య, మహిళా ఖైదీల బ్యారక్‌లు, వారి దినచర్య, జైలు అధికారులు, సిబ్బంధి విధులు, బాధ్యతలు మున్నగు విషయాలను సెంట్రల్ జైలు సూపరెంటిండెంట్ ఎం.మహేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఖైదీల సంక్షేమం, జైల్లో నిర్వహిస్తున్న వివిధ పరిశ్రమలు, వాటిలో పనిచేస్తున్న ఖైదీల పనితీరు, జైల్లో ఖైదీలకు అందిస్తున్న విద్య, ఆసుపత్రి సౌకర్యాలు, ఖైదీల్లో పరివర్తనకు తీసుకుంటున్న చర్యలు, జైలు నుంచి బయటకు వెళ్ళేటప్పుడు వారికి పునరావసం వంటి విషయాలపై అవగాహన చేసుకున్నారు. అనంతరం జైలు సమావేశ మందిరంలో ట్రైనీ జైలర్స్ సందేహాలను పర్యవేక్షణాధికారి ఎం.మహేష్ బాబు నివృత్తి చేసారు. జైలు డిప్యూటీ పర్యవేక్షణాధికారులు ఎన్. సాయిప్రవీణ్, కె.జవహర్‌బాబు, సిహెచ్.సూర్య కుమార్ పాల్గొన్నారు.